## క్లుప్తంగా

### అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి

**నూతనకల్ :** వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలుగకుండా చూడాలని ట్రాన్స్‌కో ఏడీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. వేసవిలో అకాల వర్షాలకు, ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. సంబంధిత గ్రామాలకు చెందిన సిబ్బంది అందుబాటులో ఉండి వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్, విద్యుత్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### యువకుడి మృతిపై ఆందోళన

● ఏపూరులో ఉద్రిక్తత

**ఆత్మకూర్ (ఎస్) :** యువకుడి మృతికి కారణమైన వ్యక్తిని శిక్షించాలంటూ మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఏపూరులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఏపూరు గ్రామానికి చెందిన రావుల నరేష్ (30) అదే గ్రామానికి చెందిన ఒక మహిళతో గత కొంత కాలంగా సఖ్యతగా ఉంటున్నాడు. అదే మహిళతో ఇటీవల అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి సఖ్యతగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపం చెందిన రావుల నరేష్ ఇటీవల సెల్ఫీ వీడియో తీసుకొని తన మృతికి ఆ వ్యక్తి కారణమంటూ మహబూబాబాద్ జిల్లాలోని కొరివి మండలం సమీపంలో పురుగుల మందు తాగి మృతి చెందాడు. కాగా మంగళవారం సాయంత్రం పోస్టుమార్టం అనంతరం యువకుడి మృతదేహాన్ని ఏపూరు గ్రామానికి తరలించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. నరేష్ మృతికి కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో పోలీసులు సర్ది చెప్పి ఆందోళనను విరమింపజేశారు.

### విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్ అందించాలి

**సూర్యాపేట అర్బన్ :** విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్ అందించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కుడకుడలో విద్యార్థులకు యూనిఫామ్ కుట్టే కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరానికి గానూ స్కూల్ డ్రెస్‌లు కుట్టే పనులను మున్సిపాలిటీ పరిధిలోని 25 మహిళా సంఘాల వారికి అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతమల్ల రమేష్, మెప్మా సిబ్బంది కె.రేణుక, శ్వేత, ఝాన్సీ, రోజా మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మత్తుకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు


అవగాహన కల్పిస్తున్న రాచకొండ ప్రభాకర్

**సూర్యాపేట టౌన్ :** యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల్లో అవగాహన కల్పించారు. డ్రగ్స్ వద్దు.. ప్రాణమే ముద్దు.. సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచుతూ చేతిలో మైక్ పట్టుకొని విచిత్ర వేషధారణతో ప్రచారం నిర్వహించారు.

### ఆర్జిత సెలవులు ఇస్తే వేసవిలో కూడా పనిచేస్తాం

**మద్దిరాల :** ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు ఇస్తే వేసవి మొత్తం కూడా పనిచేస్తామని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రేపాక లింగయ్య అన్నారు. మంగళవారం ముకుందాపురంలో స్వచ్ఛందంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముందు వేసవిలో కూడా బడిబాట కార్యక్రమం నిర్వహించాలని అధికారులు ఉపాధ్యాయులను బలవంతం చేయడం సరికాదని అన్నారు. బడిబాట కార్యక్రమాన్ని జూన్ 1 నుంచి నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బుస్సా వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్ కొరివి మధు, సభ్యులు అలీముద్దీన్, రోచిష్ణుకుమార్, నగేష్ పాల్గొన్నారు.

### ఉగ్రదాడి మృతులకు నివాళి

**అర్వపల్లి :** కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిపై తిమ్మాపురంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ దాడిని ఖండించారు. దాడిలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మీలా చంద్రకళ కిష్టయ్య, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ బూర్గుల రాంబాబు, రామసాని రవీందర్‌రెడ్డి, జ్యోతి, నూకల గురువయ్య, బింగి రవి, శ్రీకాంత్, కోనేటి రవి, గోవర్ధన్, కార్యకర్తలు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

# సమస్యల నిలయం.. 'అంజనాపురి'


అంజనాపురి కాలనీలో చెరువును తలపిస్తున్న ఖాళీ ప్లాటు


ఇళ్లముందు నిలిచిన మురుగు


డ్రైయినేజీ నిర్మించకుండా వేసిన సీసీ రోడ్డు

● డ్రైయినేజీలు లేక కాలనీలో ఇళ్ల ఎదుటే నిలుస్తున్న మురుగు
● చెత్తాచెదారంతో నిండుతున్న ఖాళీ ప్రదేశాలు.. విజృంభిస్తున్న దోమలు
● వీధిలైట్లు వెలగక అంధకారంతో ప్రజలకు ఇబ్బందులు

**సూర్యాపేట అర్బన్ :** సూర్యాపేట పట్టణంలోని అంజనాపురి కాలనీలో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ పట్టణానికి శివారులో ఉండడం.. కొత్తగా ఏర్పడింది కావడంతో ఎవరూ పట్టించుకోవడంలేదు. కాలనీలోని చాలా ప్లాట్లలో మురుగునీరు చేరి చిన్న చిన్న చెరువులను తలపిస్తున్నాయి. కాలనీ నిర్మించి దాదాపుగా 25ఏళ్లు అవుతోంది. అయినా కాలనీలోని చాలా ఇళ్లకు ఇంకా మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇవ్వలేదు. కాలనీలోని మూసీ ఎడమ కాలువ బ్రిడ్జి నుంచి జనగామ మెయిన్ రోడ్డు వరకు రోడ్డు మొత్తం గుంతలమయంగా మారి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

**జాడలేని డ్రైయినేజీ వ్యవస్థ..**

అంజనాపురి కాలనీలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల డ్రైయినేజీలు నిర్మించకుండానే సీసీ రోడ్లు వేశారు. దీంతో నివాస గృహాల నుంచి వెలువడే మురుగునీరు ఖాళీ ప్లాట్లలోకి చేరి మురుగు కూపాలుగా తయారయ్యాయి. కాలనీవాసులు చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలను ఖాళీ స్థలాల్లో వేస్తుండటంతో అవి కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అపరిశుభ్ర పరిసరాల కారణంగా చాలామంది సీజనల్ వ్యాధులకు గురవుతున్నారు. అంతేకాకుండా కాలనీలోని ఖాళీ ప్రదేశాలలో సర్కారు చెట్లు ఏపుగా పెరిగి పందులకు నివాసాలుగా మారాయి. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది కాలనీవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగినా, మురుగునీరు నిలిచినా కనీసం ప్లాట్ల యజమానులు కూడా పట్టించుకోకపోవడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలో మురుగుకూపాలుగా మారిన ప్లాట్లను శుభ్రం చేయించేలా సదరు యజమానులకు నోటీసులు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

**అంధకారంగా వీధులు..**

కాలనీలోని చాలా వీధుల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయలేదు. కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేసినా అవి కూడా తరచూ రిపేరుకు వస్తున్నాయి. కాలనీలోని వీధులన్నీ రాత్రి అంధకారంగా దర్శనమిస్తున్నాయి. ఖాళీ స్థలాల నుంచి విషసర్పాలు బయటకు వచ్చి సంచరిస్తుండటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

**ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో..**

65వ జాతీయ రహదారిపై జనగామ క్రాస్ రోడ్డు దగ్గర ఇటీవల ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కారణంగా వాహనాలు మొత్తం అంజనాపురి కాలనీ రోడ్డు నుంచి జనగామ క్రాస్ రోడ్డుకు వెళ్తున్నాయి. దీంతో అంజనాపురి కాలనీ సర్కిల్ వద్ద రోడ్డు దాటుతుండగా నిత్యం చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదకరంగా ఉన్న ఈ ప్రాంతంలో సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని, అలాగే ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని వాహనదారులు కోరుతున్నారు.

**ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలి**



ఖాళీ ప్లాట్లలో మురుగు నీరు చేరడం వల్ల దోమలు వృద్ధి చెంది రాత్రి పూట చాలా ఇబ్బంది పెడుతున్నాయి. పందుల బెడద కూడా ఉంది. ప్లాట్ల యజమానులతో మాట్లాడి ప్లాట్లను క్లీన్ చేయించాలి. ప్లాట్లచుట్టూ రక్షణ వలయం ఏర్పరచుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. సైడ్ కాలువలు వేయకుండా వదిలేశారు. డ్రైయినేజీలు నిర్మించకపోవడంతో ఇళ్ల ఎదుట మురుగు నీళ్లు ఆగుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– కోట సురేష్‌రెడ్డి, అంజనాపురి కాలనీ

# భూభారతితో సమస్యలు తీరుతాయి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**చివ్వెంల :** భూభారతితో రైతుల సమస్యలు తీరుతాయని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం భూభారతిపై రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తికి ఆధార్ కార్డులు ఉన్నట్లే, ప్రతి భూమికి భూధార్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి భూభారతి చట్టం ద్వారా సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. భూభారతిపై రెవెన్యూ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, తహసీల్దార్ క్రిష్ణయ్య, మండల ప్రత్యేకాధికారి జగదీష్ రెడ్డి, ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరావతు వీరన్న నాయక్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**విద్య ద్వారానే సమాజంలో మార్పు**

**భానుపురి :** విద్య ద్వారానే సమాజంలో పేదరికం తొలిగిపోయి దేశం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని సూర్యాపేట, ఆత్మకూరు(ఎస్), పెన్‌పహాడ్, చివ్వెంల, మోతె మండలాలకు చెందిన ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులతో ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు.ఉపాధ్యాయులు బాధ్యతగా ఉంటూ గతేడాది వైఫల్యాలను సరిచేసుకుని రాను న్న విద్యాసంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలలోనే విద్యార్థులకు తెలుగు భాష రాయడం, చదవడం నేర్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఈఓ అశోక్, క్వాలిటీ కోఆర్డినేటర్ జనార్దన్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రవణ్ కుమార్, ఇంక్లూజివ్ కో ఆర్డినేటర్ రాంబాబు, జనరల్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్ పూలమ్మ, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


తిరుమలగిరి : జలాల్‌పురంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

**తిరుమలగిరి :** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. గ్రామాలలో మంగళవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. జలాల్‌పురంలో హెచ్ఎం జి.అశోక్ మాట్లాడుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ, జీవి, జ్యోతి, ఖాసీమ్, వాసవి, సీఆర్పీ సోమేశ్వర్, అంగన్‌వాడీ టీచర్ రమ పాల్గొన్నారు.

**నాగారం :** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు బింగి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పసునూర్ గ్రామంలో జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎర్ర హరికిషన్, యనగందల శివకుమార్, కనకం వెంకన్న, శ్రీదేవి, సత్యనారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**అర్వపల్లి :** అర్వపల్లిలోని ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం యాకలక్ష్మి, ఉపాధ్యాయులు కుంభం రేణుక, భూపతి స్వరూపరాణి, శైలజ, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లి : బడిబాట ప్రచారం..


నాగారం : పసునూర్‌లో..

# మేడే వేడుకలను జయప్రదం చేయాలి


ఆత్మకూర్(ఎస్): పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**తిరుమలగిరి :** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను వాడ వాడలా ఘనంగా జరుపుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లంల యాదగిరి కోరారు. మంగళవారం తొండ గ్రామంలో ఆ పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్‌డీ ఫయాజ్‌మియా, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, సహాయ కార్యదర్శి ఎల్లంల కొమురెల్లి, సత్తయ్య, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూర్ (ఎస్) :** మేడేను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద ఐకేపీ కేంద్రంలో హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో మేడే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు లక్ష్మయ్య, సార్ల వెంకన్న, ఎస్‌కే సైదులు, కొండల్, జి.లింగయ్య, మారేపల్లి నాగయ్య, కృష్ణ, రాజేష్, బొడ్డు మహేష్, వెంకన్న, నవీన్ పాల్గొన్నారు.

**నాగారం :** మేడే వేడుకలను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు జాజుల సామేలు కోరారు. మంగళవారం వర్ధమానుకోటలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

**నూతనకల్ :** మే 1న నిర్వహించే ప్రపంచ మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యానాల వెంకట్‌రెడ్డి, లింగయ్య, రవి పాల్గొన్నారు.

**పెన్‌పహాడ్ :** మేడేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ కార్మికులు, శ్రామికులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు, హమాలీ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్లు ఒగ్గు మట్టయ్య, సిల్వేరు సైదులు, ఎడవెల్లి ఎల్లమ్మ, సత్తెమ్మ, రజిత, నీరజ పాల్గొన్నారు.

# ధైర్యంగా సేవలు అందించాలి


ల్యాంప్ లైటింగ్‌లతో శ్రీలక్ష్మీవెంకటసాయి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

**సూర్యాపేట టౌన్ :** సమాజంలో నర్సింగ్ వృత్తి గొప్పదని, ఆ వృత్తిలోకి వచ్చేవారు ధైర్యంగా ఉండి సేవ చేయాలని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జే ఫంక్షన్ హాల్‌లో శ్రీలక్ష్మీవెంకటసాయి నర్సింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు ల్యాంప్ లైటింగ్, ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సత్యనారాయణ హాజరై మాట్లాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను నర్సింగ్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో రోగులకు డాక్టర్లు చేసే వైద్యం ఎంత ముఖ్యమో.. నర్సులు చేసే సేవ కూడా అంతే ముఖ్యమని చెప్పారు. అలాంటి వృత్తిలోకి వస్తున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ రేణుక బాయి, జనరల్ ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ జనార్దన్, కళాశాల కరస్పాండెంట్ కారింగుల బాలగౌడ్, చైర్మన్ కారింగుల విజయలక్ష్మి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న, ఒకేషనల్ ప్రిన్సిపాల్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

### 2నుంచి వాలీబాల్ శిక్షణ

**అర్వపల్లి :** అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో వచ్చే నెల 2 నుంచి 31 వరకు జిల్లా స్థాయి ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంప్ ఇన్‌చార్జ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు, పీడీ పి.మల్లేష్ తెలిపారు. మంగళవారం ఆయన అర్వపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వేసవిలో పిల్లలు క్రీడలు నేర్చుకోవడానికి 14 ఏళ్లలోపు బాలబాలికలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరానికి బిగ్‌హెల్ప్ సంస్థ కూడా తమ వంతు సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు శిబిరం జరుగుతుందని, ఆసక్తి గలవారు రావాలని కోరారు.

### కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**అర్వపల్లి :** ధాన్యం కొనుగోళ్లను అధికారులు వేగవంతం చేయాలని పూలే-అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపకుడు ఈదురు వీరపాపయ్య కోరారు. మంగళవారం ఆయన అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వెళ్లే లారీల దిగుమతుల్లో జాప్యంతో కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నాయని చెప్పారు. దీంతో అన్నదాతలు రోజుల తరబడి కేంద్రాల్లో నిరీక్షించాల్సి వస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించి వెంటనే కొనుగోళ్లను పూర్తిచేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులకు అవకాశం కల్పించాలన్నారు. అధికార పక్షం వారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో సంఘం బాధ్యులు సురేందర్, నర్సింహ, వెంకన్న, కృష్ణయ్య, యాదగిరి, కోటేష్, వెంకటమ్మ, సరస్వతి, రమాదేవి, సామేలు, అరుణ్, శ్రీను పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు పంపిణీ


అర్వపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది


ఆత్మకూరులో..

**అర్వపల్లి :** అర్వపల్లి పీహెచ్‌సీలో మంగళవారం క్షయ వాధిగ్రస్తులకు మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్‌నాయక్, సీహెచ్ఓ బిచ్చునాయక్ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్షయ వ్యాధిగ్రస్తులు పోషకాహారం తీసుకొని మందులు క్రమం తప్పకుండా వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లలిత, టీబీ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఎస్‌టీఎస్ కిరణ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆత్మకూర్ (ఎస్) :** టీబీ బాధితులు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీడీఓ ఎండీ హాసిం అన్నారు. జాతీయ టీబీ నిర్మూలన ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం ఆత్మకూరు మండల ఆరోగ్య కేంద్రంలో టీబీ బాధితులకు పౌష్టికాహారం కిట్లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. టీబీ బాధితులు ప్రభుత్వ వైద్యుల సలహాల మేరకు ఎప్పటికప్పుడు మందులు వాడాలని సూచించారు. ప్రభుత్వం బియ్యంతోపాటు ఐదు రకాల పోషక విలువలు కలిగిన పప్పుధాన్యాలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి మౌనిక, టీబీ నివారణ కార్యక్రమం సూపర్‌వైజర్ పెన్ని, సీహెచ్ఓ యాదగిరి, సూపర్‌వైజర్ మాణిక్య, టీబీ నోడల్ పర్సన్ కొండ్లె శ్రీనువాస్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# సభకు ఎడ్లబండ్లపై వెళ్లిన రైతులకు సన్మానం


రైతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**ఆత్మకూర్ (ఎస్) :** వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఇటీవల బీఆర్ఎస్ నిర్వహించిన రజతోత్సవ సభకు మండలం నుంచి ఎడ్లబండ్లతో వెళ్లిన రైతులను సోమవారం స్థానిక నాయకులు శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ గోపగాని వెంకటనారాయణ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఎండను సైతం లెక్కచేయకుండా రైతులు మండలం నుంచి 16 ఎడ్ల బండ్లపై బయలుదేరి కేసీఆర్‌కు మద్దతు తెలపడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూడి నరసింహారావు, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి, కసగాని బ్రహ్మం, ముద్దం కృష్ణారెడ్డి, బత్తుల ప్రసాద్, సోమిరెడ్డి వెంకటరెడ్డి, బోళ్ల వెంకటరెడ్డి, గిలకత్తుల సోమయ్య, గుగులోతు వెంకన్న, తంగెళ్ల శ్రీనివాసరెడ్డి, పార్వతి నరసింహ, వల్లోజు ప్రశాంత్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌ను కలవరపెడుతున్న వరంగల్ సభ**

**తుంగతుర్తి :** వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ సభను చూసిన కాంగ్రెస్ నాయకులు కలవరపడుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, గునగంటి సతీష్ పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాల పరిశీలన

**తిరుమలగిరి :** కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేగవంతం అయ్యేలా చూడాలని తహసీల్దార్ హరిప్రసాద్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం తిరుమలగిరి మండల పరిధిలోని తాటిపాముల, వెలిశాల, మాలిపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులు 15 శాతంలోపు తేమ ఉండే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టుకొని తీసుకరావాలని అన్నారు. కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఆర్ఐ సుజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న మల్లు నాగార్జున రెడ్డి

**సూర్యాపేట అర్బన్ :** జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో తాగునీటికి సమస్య తీవ్రంగా ఉందని, తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవిలో రోజు రోజుకూ తాగునీటి ఎద్దడి తీవ్రం అవుతోందన్నారు. ప్రధానంగా దళిత, గిరిజన వాడల్లో ఈ సమస్య నెలకొందని తెలిపారు. కలెక్టర్ స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఐకేపీ కేంద్రాలకు ధాన్యం వచ్చి నెల రోజులు అవుతున్నా కాంటాలు వేయకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, ఎల్గూరి గోవింద్, వీరబోయిన రవి, జె.నరసింహారావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లింగమంతుల స్వామి, గంగ దేవమ్మ జాతర


పస్తాలలో బోనాలతో వెళ్తున్న మహిళలు

**నాగారం :** మండల పరిధిలోని పస్తాలలో లింగమంతులస్వామి, వర్ధమానుకోటలో గంగదేవమ్మ జాతరలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. యాదవులు భేరీలు కొడుతూ కాళ్లకు గజ్జలు కట్టుకొని నృత్యాలు చేశారు. మహిళలు బోనాలను అందంగా అలంకరించి దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. యాదవులు చేసిన కటారి విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

### అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

**పెన్‌పహాడ్ :** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇళ్లు వస్తున్నాయని అన్నారు. ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, ఊరుకొండ రాధాకృష్ణ, కొండా జానకిరాములు, జుట్టుకొండ సత్యనారాయణ, భూక్య రవీందర్, భూక్య సైదానాయక్ పాల్గొన్నారు.

### డ్రైయినేజీలో పూడిక తొలగింపు


మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

**సూర్యాపేట అర్బన్ :** ఈ నెల 27న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'పూడిక తీయక.. మురుగు పారక' అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మంగళవారం పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో మున్సిపల్ సిబ్బంది కాలువలోని మురుగును తొలగించారు.

### ఇందిరమ్మ ఇళ్ల సర్వే

**అర్వపల్లి :** మండలానికి ఇందిరమ్మ పథకంలో 265 ఇళ్లు మంజూరు కాగా ఐదు బృందాల ద్వారా సర్వే జరుగుతోందని ఎంపీడీఓ తిరునగరి గోపి తెలిపారు. మంగళవారం కోడూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరిపారు. గ్రామాల వారీగా కేటాయించిన బృందాలు ఇంటింటి సర్వే చేస్తున్నాయని చెప్పారు. మండలవ్యాప్తంగా గృహనిర్మాణ శాఖ డీఈ జబ్బార్ అహ్మద్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కుమారస్వామి, నవీన్‌కుమార్, ఏఓ గణేష్ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ముందస్తు అరెస్టు

**మద్దిరాల :** తమ డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీ సిబ్బంది మంత్రి సీతక్క ఇంటి ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం మద్దిరాల మండలంలోని అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో అంగన్‌వాడీ టీచర్లు గుర్వోజు రమాదేవి, కాటి అంజలి, అరుణ, అన్నపూర్ణ, విజయలక్ష్మి, కొమ్ము సునీత తదితరులు ఉన్నారు.